4

# సుబ్బాయమ్మగారు

-జొన్నలగడ్డ రామలక్ష్మి

"హెచ్చరించకేమిరా? ఆయన నామాట వింటారు గనుకనా '' అన్నది సుబ్బాయమ్మగారు.

"ఎందుకు వినరు బామ్మా? ఎందరో నీమాటలు విన్నారు...."

"మీ తాతగారి వంశం గొప్పది, గొప్ప వంశంలో మొగుడు పెళ్ళాం మాట వినడు_"

"కానీ నువ్వువినేలా చేయగలవు"

"నీకు తెలియదురా భర్తను భార్య అనుసరించాలని మన శాస్త్రాలు చెబుతున్నాయి. నేను శాస్త్రాలుచెప్పిన ప్రకారం చేశాను."

రామం నవ్వి "శాస్త్రాల సంగతి అటుంచు బామ్మా! తాతగారు నీమాట వింటే ఏం చేసే దానివి?" అన్నాడు.

"ఆయన నామాట వింటే ఈ ఇంట్లో కనక వర్షం కురిసేది. ఆయన పేరుకు పెద్దగా ఉంటే చాలు. మిగతావన్నీ నేనే చూసుకుని ఉండేదాన్ని. ఆయన నామాట వినిఉంటే ఈ యింట్లో డబ్బుకు డబ్బూ ఉండేది _ ఆయన సరదాలూ తీరేవి—" అన్నది సుబ్బాయమ్మగారు. అలా అన్నప్పుడు ఆమె కళ్ళు మెరిశాయి.

"బామ్మా నేను నీమాట వింటాను. ఏంచేయాలో చెప్పు" అన్నాడు రామం.

సుబ్బాయమ్మగారు తెల్లముఖం వేసి "చదువుకున్న వాడివి నీకు నేను చెప్పడమేమిట్రా?" అన్నది.

రామం ఆమెకు వివరించాడు.

అతడిప్పుడు బీయస్సీ ప్యాసయ్యాడు. ఉద్యోగం వస్తే జీతం నెలకు మూడువందలు మించదు. ఆ మూడు వందలతో అతడు కుటుంబాన్ని పోషించుకుంటాడా లేక పదిమందికీ సాయపడతాడా?

"అయితే ఏం చేస్తావు?"

"నువ్వు చెప్పినట్లు చేస్తాను. ఏం చేయాలో చెప్పు_"

"నా మొహం నేను చెప్పడమేమిట్రా?" అన్నది సుబ్బాయమ్మగారు.

"బామ్మా అందరూ నిన్ను తప్పుపడుతున్నారు. ని వల్లనే కుటుంబం పాడైందంటున్నారు. నీ కారణంగానే తాతగారు ఆస్తి తగలేశారంటున్నారు. నేను నీ దగ్గరకు రావడం వల్ల చెడిపోతానని అంటున్నారు. కానీ బామ్మా నేను నీలో దేవతను చూడగలుగుతున్నాను. అ దేవత వరాలిస్తుంది. దారి చూపిస్తుంది_"

"నేను దేవతనేమిట్రా_నా మొహం—"

"నువ్వు దేవతవే బామ్మా! నీకున్న శక్తి అపారం, ఇంతకాలం నీ శక్తి తాతగారి పేరు చెప్పి వృధాగా పోయింది. ఇప్పుడలా జరగడానికి వీల్లేదు_"

"అంటే?"

"బామ్మా ఈరోజుల్లో ఆడవాళ్ళు కానీ మగవాళ్ళు కానీ అందరూ ఎందుకూ పనికిరాని వాళ్ళు. మగాళ్ళు చదువుకుని ఉద్యోగాల కోసం ఎగబడడం ఆడవాళ్ళు మొగుడి సంపాదనను ఖర్చు పెట్టడం_ ఇవీ మధ్యతరగతి కుటుంబాల కథ! మీ కాలం ఆడవాళ్ళు అలాకాదు. మీలో ఒక సంస్థను నడిపించగల శక్తి ఉండి కూడా అవి తాతగారి వంటి వారిని అనుసరించడం వలన వృధా అయిపోయేది' నీ సామర్థ్యమంతా తాతగారి సేవలో గడిచిపోవడంలో నీ శిక్షణ నీ పిల్లలకు రాలేదు. వాళ్ళకు నీ శిక్షణ అంటే ఏమిటో తెలియదు. కానీ నేను నీ శిక్షణను ఊహించుకుంటున్నాను. నీ కారణంగా గొప్పవాడిని కావలెనని, కాగలననీ ఆశిస్తున్నాను" అన్నాడు రామం.

"అయితే ఏం చేద్దామని నీ ఉద్దేశ్యం!"

"నేను నీతోనే ఉండపోతాను. గొప్పవాడినౌతాను. సుబ్బాయమ్మగారంటే ఏమిటో ప్రపంచానికి తెలియజేస్తాను" అన్నాడు రామం.

సుబ్బాయమ్మ గారి కళ్ళు మెరిశాయి— "ఒరేయ్ నువ్వు నిజంగా నామాట వింటావా? నాతోనే వుండిపోతావా?"

"అవును బామ్మా!"

"ఇది నిజమే కదూ_"

"నీమీద ఒట్టు బామ్మా!"

"అయితే ఈ రోజే రంగారావు డాక్టరుగారి దగ్గరకు వెడదాం—" అన్నది సుబ్బాయమ్మగారు.

"డాక్టరుగారి దగ్గర కెందుకు?"

"ఏదో తెలియని అనారోగ్యం నన్ను పీడిస్తున్నది. ఇంతకాలం ఆచార్లుగారి వైద్యంతో సరిపెట్టుకుంటున్నాను. ఈ ఎందుకట్టె ఎప్పుడు రాలిపోతేనేంలే అని భావించాను. కానీ ఇప్పుడు నామనుమడు నేను కావాలంటున్నాడు. నీకోసం నేను మరిన్ని ఏళ్ళు బ్రతకాలి. నీ నమ్మకాన్ని నిజం చేయాలి." అన్నది సుబ్బాయమ్మగారు ఉత్సాహంగా.

రామానికి కళ్ళు తిరిగినట్లయింది, బామ్మ జీవితం మీద విరక్తితో ఆరోగ్యాన్ని అలక్ష్యం చేస్తున్నదా? ఈ విషయం ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదా?

"అదేంటి బామ్మా? ఇంతకాలం నీ ఆరోగ్యాన్ని అలక్ష్యం చేశావా? కనీసం ఎవరికైనా చెప్పవచ్చుగా?"

"వృద్ధురాలైన ముసలితల్లి అనారోగ్యం గురించి ఏడుగురు పిల్లల్లో ఒక్కరికి కూడా చెబితేగానీ తెలియనప్పుడు ఆ వెధవ బ్రతుకు బ్రతికి మాత్రం ఏం లాభం?"

రామం ఇంకేమీ మాట్లాడలేదు.


181

*

డాక్టర్ రంగారావు సుబ్బాయమ్మగారిని బాగా పరీక్షించేక – రామాన్ని చాటుగా పిలిచి ‘‘మీ బామ్మకు గర్భాశయంలో క్యాన్సరున్నదని నాకు అనుమానంగా ఉన్నది. అందుకు పట్నం వెళ్ళి పరీక్షలు చేయించాలి’’ అన్నాడు.

రామం తెల్లబోయాడు ఒకటి — బామ్మకు క్యాన్సరు అన్నందుకు. రెండు - క్యాన్సరు చికిత్స చాలా ఖర్చుతో కూడిన పని.

అతడు బామ్మను తీసుకుని ఇంటికి వెళ్ళాడు. ఆమెకు క్యాన్సర్ అన్న విషయం చెప్పకూడదనే అనుకున్నాడు,

రామం దిగులుగా వుండడం చూసి – ‘‘డాక్టరే మన్నాడురా?’’ అన్నది సుబ్బాయమ్మగారు.

‘‘ప్రమాదమేమీ లేదు కానీ వైద్యానికి విశాఖపట్నం వెళ్ళాలి. చాలా ఖర్చవుతుంది—’’ అన్నాడు రామం.

‘‘ఎంతవుతుందేమిటి?’’

‘‘ఏమో_రెండు మూడు వేలు కావచ్చు_’’

సుబ్బాయమ్మగారు నవ్వి ‘‘రోగానికీ డబ్బుకీ కూడా వడ్డీ వుంటుంది. నా చికిత్సకు అయిదారేళ్ళు వాయిదా వేశావంటే అప్పుడు మనం రెండు మూడు వేలేంటి—ఇరవై వేలదాకా ఖర్చు పెట్ట గలం. ప్రస్తుతానికి ఆ విషయం మరిచిపో’’అన్నది.

‘‘వద్దు బామ్మా! ముందు చికిత్స జరగాల్సిందే’’ అన్నాడు రామం.

‘‘విశాఖపట్నం వెళ్ళాలంటే చేతిలో అయిదు వేలైనా వుండాలి. అంత డబ్బు ఒక్కసారి ఎక్కణ్ణించి వస్తుంది?’’ అన్నది సుబ్బాయమ్మ గారు.

‘‘నేను తెస్తాను’’ అన్నాడు రామం.

‘‘ఎక్కణ్ణించి తెస్తావురా?’’ అన్నది సుబ్బా యమ్మగారు.

‘‘ఎలాగో తెస్తాను’’ అన్నాడు రామం. ఆరోజే అతడు ఇల్లు వదిలాడు. ఆ తర్వాత సరిగ్గా వారం రోజుల్లో అతడు అయిదు వేలతో తిరిగి వచ్చాడు.

‘‘ఎక్కడిదిరా ఇంత డబ్బు?’’ అన్నది సుబ్బా యమ్మగారు.

‘‘పార్థసారథిగారి దగ్గర అప్పు తెచ్చాను’’ అన్నాడు రామం.

‘‘పార్థసారథిగారంటే?’’

‘‘నీకు తెలియదులే వాళ్ళమ్మాయి లక్ష్మిని నాకిచ్చి పెళ్ళి చేయాలని ఆయన సంకల్పం. ఆయన్ని నేను తప్పించుకుని తిరుగుతూంటాను. ఇప్పుడీ డబ్బు అప్పు చేశానంటే ఆయన చేతిలో నా పిలక వున్నట్లే. కానీ నా బామ్మను రక్షించుకు నేందుకు ఇదే నాకు మార్గమనిపించింది.’’

‘‘సరే ఒకసారి డాక్టరు రంగారావు గారికి కనిపించిరా’’ అన్నది సుబ్బాయమ్మగారు.

రామం డాక్టరు రంగారావుగారింటికి వెళ్ళాడు.

‘‘వెరీసారీ_మిస్టర్ రామం! మీ బామ్మగారి ఆరోగ్యం నిక్షేపంలాగున్నది. ఆమె కోరిక మీదే నీకు అబద్ధం చెప్పాను’’ అన్నాడు రంగారావు.

‘‘అబద్ధమెందుకు?’’

‘‘ఏమో_నీచేత ఏదో ఒప్పించడానికి ఆమె నా సహాయం కోరారు. రామారావుగారి వల్ల ఉపకారం పొందిన వాడిని. ఆమె ఏమడిగినా చేయాల్సిన ధర్మం నాకున్నది.’’

రామం ఉత్సాహంగా ఇంటికి పరుగెత్తాడు.

రామం ఇంటికి తిరిగి వచ్చేసరికి సుబ్బాయమ్మ గారు చాలా ఉత్సాహంగా వున్నది. ఆమె రామా న్నేమీ మాట్లాడనివ్వకుండా ‘‘నువ్వు మీ వూరెళ్ళి పార్థసారథిగారి వద్ద తెచ్చిన డబ్బు ఆయనకిచ్చి రావచ్చు’’ అన్నది.

‘‘బామ్మా నువ్వు నాకు అబద్ధం చెప్పావు—’’ అన్నాడు రామం.

‘‘ఏమిట్రా ఆ అబద్ధం!’’

‘‘నీకు క్యాన్సరని....’’

‘‘అబద్ధం నేను కాదు డాక్టరు చెప్పివుంటాడు’’

‘‘కానీ ఆ డాక్టరుకు అబద్ధం చెప్పమని నువ్వే చెప్పావట.’’

‘‘ఒక అబద్ధం చెప్పిన వాడి మాట ఎవ్వరూ నమ్మకు. వ్యాపారంలో పైకి రాలేవు.’’ అన్నది సుబ్బాయమ్మగారు.

‘‘అబద్ధమెందుకు చెప్పావు బామ్మా!’’

‘‘అందుకు రెండు కారణాలు. ఒకటి—నీకు నామీద ఎంత అభిమానముందో తెలుసుకోవడం కోసం. రెండు - నాకు అర్జంటుగా డబ్బు కావాలి’’,

‘‘మరిప్పుడా డబ్బు వెనక్కు ఇచ్చేస్తానంటు న్నావు—’’

‘‘ఇంటిమీద మూడు వేలు అప్పు వున్నది. అది తీర్చితే మళ్ళీ ఇరవై వేలు తెచ్చుకోవచ్చు’’

‘‘తెచ్చుకుని?’’

‘‘నా తమ్ముడు అస్తమానూ అంటూండేవాడు. ‘నువ్వు మా వూరొచ్చేయి బావా! డైరీఫారం పెట్టొచ్చు. ఎరువుల కొట్టు పెట్టొచ్చు. మావూళ్ళో నేను తప్ప ఆ పని చేయగలవాళ్ళు లేరు. నాకేమో అలాంటి పనులకు తీరుబడి లేదు’అని అస్తమానూ అంటూంటే ఆయనేమీ లెక్క చేసేవారు కాదు. నేను ఆయనకు చెప్పగలదాన్నీ కాదు. ఇప్పుడు నువ్వు నా మాట విన్నావంటే....’’

సుబ్బాయమ్మగారు చెప్పుకుని పోతూంటే రామం ఆలోచిస్తున్నాడు. బామ్మ తమ్ముడి గురించి అతడికి తెలుసు. ఆయనకా వూళ్ళో చాలా భూములున్నాయి. కానీ ఆయన వూళ్ళో వుండడు. దగ్గరలోని పట్నంలో వుంటూ అప్పుడప్పుడు వ్యవసాయం పనులకు పల్లెటూరు వెడుతూంటాడు.



ఆయన కాస్త కులాసా మనిషి. అయితే తన కున్నంతలోనే జల్సాగా గడపుతూంటాడు.

"పల్లెటూళ్ళో స్థిరపడ్డానికి నువ్వు సిద్ధపడితే— మనం నా తమ్ముడింట్లోనే మకాం పెట్టొచ్చు. ఇల్లు ఖాళీగా వుంది'' అన్నది సుబ్బాయమ్మగారు.

*

సరిగ్గా ఆరేళ్ళు గడిచాయి.

పల్లెటూళ్ళో రామం ప్రారంభించిన ఎరువుల దుకాణం చక్కగా కొనసాగుతున్నది. అరడజను గేదెలతో ప్రారంభించిన డైరీ యాభై పశువుల దాకా దేకింది. సుబ్బాయమ్మగారి నాలుగెకరాలూ పది అయ్యాయి. రామం ఆ ఊళ్ళోనే చవగ్గా బేరానికి వస్తే ఓ పెంకుటిల్లు కూడా కొన్నాడు.

ఇదంతా ఎలా జరిగిందో రామానికే ఆశ్చర్యంగా వుంది. అంతా బామ్మ చలవ అని అతడికి తెలుసు.

సుబ్బాయమ్మగారికి డబ్బుమీద కంటె మనుషుల మీద నమ్మకం ఎక్కువ. డబ్బు మీద కంటె మనుషుల మీద అభిమానం ఎక్కువ. ఆమె వూళ్ళో అడుగు పెట్టిన ఆరు నెలల్లోనే అన్నపూర్ణమ్మ తల్లిగా ఆ వూళ్ళో పేరు తెచ్చుకున్నది. ఆమె తెచ్చుకున్న పేరు రామానికి శ్రీరామ రక్షగా వున్నది.

తను వృద్ధిలోనికి వస్తూ, తన చుట్టు పక్కల వున్న వాళ్ళు వృద్ధిలోనికి రావడానికి సాయపడుతూ తన వద్ద పనిచేసే వాళ్ళను ఆత్మీయుల్లా చూసుకుంటూ రామం ఆ వూళ్ళో మంచి మనిషనీ, వూరికి అవసరమైన వ్యక్తి అనీ పేరు వద్దాడు.

వ్యవసాయం పనుల్లో కానీ, వ్యవహారాల్లో కానీ, సుబ్బాయమ్మగారి గ్రహణశక్తి అద్భుతం. ముందు చూపు అపూర్వం.

తన సంపదను ఒక్కసారి ఆబగా పెంచుకుపోవాలనుకునే వాడికి ఏదో ఒక రోజున పతనం తప్పదు. తన లాభాన్ని పది మందికీ పంచుకునే వాడికి పతనం వుండదు.

రామం అలా దూసుకుని ముందుకు వెడుతూనే వున్నాడు.

రామం పరిస్థితి చూసి తండ్రి గోపాలం తెల్లబోయాడు. ఆయన ఎప్పటి కప్పుడు కొడుకు గురించి విచారిస్తూ అతడి ప్రగతికి సంతోషించడానికి బదులు ఆశ్చర్య పడుతూ వుండే వాడు. అలా రెండేళ్ళు గడిచాక అతడే స్వయంగా తల్లివద్దకు వెళ్ళి "అమ్మా! నీ రెండో మనుమడిని కూడా నువ్వే తీర్చిదిద్దాలి'' అన్నాడు.

రామం తమ్ముడు చంద్రం అప్పటికి బియ్యే మొదటి సంవత్సరంలో వున్నాడు. అతడు రామం కంటే నాలుగు సంవత్సరాలు చిన్న.

"ముందు రామాన్ని ఒక దారిలో పెట్టనీ— తర్వాత చంద్రం గురించి ఆలోచిస్తాను'' అన్నది సుబ్బాయమ్మగారు.

ప్రస్తుతం చంద్రం బియ్యే ప్యాసై ఖాళీగా వున్నాడు. చాలా చోట్ల ఉద్యోగాలకు అప్లై చేశాడు కానీ ఇంకా ఫలితం కనబడడం లేదు.

ఒక రోజున గోవిందం సుబ్బాయమ్మ గారింటికి వచ్చాడు. అప్పుడు రామం ఇంట్లో లేడు.

"అత్తయ్యా! మాధవికి ఇప్పుడు ఇరవై రెండేళ్ళు'' అన్నాడాయన.

"అబ్బా-అప్పుడే అంత పెద్దదైపోయిందా!'' అన్నది సుబ్బాయమ్మగారు.


"రామం కూడా పెద్దవాడైపోతున్నాడు—'' అన్నాడు గోవిందం.

"ఊళ్ళో కూడా అంతా అదే మాట అంటున్నారు. వాడినిప్పుడు వూరి పెద్దల్లో జమవేశారు.''

"అదికాదత్తయ్యా — పెద్దవాడంటే వయసు గురించి మాట్లాడుతున్నాను. బెండకాయ ముదిరినా అన్న సామెత వుందనే వుందిగా!''

"ఈ వూళ్ళో ఎవరినడిగినా చెబుతారు. సుబ్బాయమ్మగారి చేలో బెండకాయలు ఎదగడమే కానీ ముదరడం వుండదు.''

"చల్లకు వచ్చి ముంత దాచడమెందుకు! నేను వచ్చిన పని చెబుతాను. మాధవిని రామానికిచ్చి



చేయడానికి మీ అనుమతి కావాలి'' అన్నాడు గోవిందం.

సుబ్బాయమ్మగారి ముఖం గభీరంగా అయిపో యింది.

''మాధవికింకా పెళ్ళికాలేదా?''

''మీకు తెలియకుండా దాని పెళ్ళెలాగౌతుంది?''

''మరి-రామానికి మాధవి నివ్వనన్నావని గుర్తు.''

''ఏదో-వాడు తప్పుదారిలో వున్నాడనుకుని.''

''ఏ దారి మంచిదో, ఏది చెడుదో తెలియని వాడి పిల్లని మా రామానికెలా చేసుకుంటాం?''

''అయిన వాళ్ళం, చనువు కొద్దీ లక్ష అనుకుంటాం.''

''అయిన వాళ్ళం కదా-ఆ చనువుకొద్దీ నేను కొన్ని షరతులు పెడతాను'' అన్నది సుబ్బా యమ్మగారు.

''అంతా మీ యిష్టం.''

''రామం పల్లెటూళ్ళోనే వుంటాడు నా దగ్గరే మాధవి ఇక్కడ ఈ వూళ్ళో వుండగలదా?''

''రామం ఇక్కడే వుండొచ్చు. మాధవి కూడా ఇక్కడే వుంటుంది కానీ మీరు మాత్రం ఇక్క డుండ డానికి వీల్లేదు.''

సుబ్బాయమ్మగారి ముఖం ఎర్రబటింది— ''ఎందుకని?''

''మా రెండో అమ్మాయి సుధను చంద్రానికిద్దా మనుకుంటున్నాను. చంద్రం చేత నేను ప్రెస్సు పెట్టించాలనుకుంటున్నాను. అందుకు నా షరతు ముందే చెప్పేశాను. మీరు చంద్రంతో వుండాలి.''

''ఏమిటీ?'' అన్నది సుబ్బాయమ్మగారు.

''రామం మీ సంప్రదింపులతోనే పైకి వచ్చాడు. కానీ ఇంకా వాడు మీ సలహాలపైనే ఆధారపడు తున్నాడు. స్వతంత్రంగా బ్రతకడం వాడికి రావాలి. అలాగే చంద్రం పైకి రావడానికి మీ సలహాలు కావాలి.''

''రామాన్ని వదిలి నేను వుండలేను.'' అన్నది సుబ్బాయమ్మగారు.

''మామయ్యగారు మసిలిన ఇల్లంటే మీకు ప్రాణమనీ, అక్కడికైతే రానని అనరనీ నమ్మి నేను మీ వూళ్ళోనే ప్రెస్సు పెట్టాలనుకుంటే— మీరిలాగనడం భావ్యంకాదు'' అన్నాడు గోవిందం.

సుబ్బాయమ్మగారు వేదాంతిలా నవ్వి ''ఈ ప్రపంచంలో మనుషులొక్కరే అశాశ్వతం అను కున్నాను. మనుషుల మనసులూ శాశ్వతంకాదు. నా కారణంగా రామాన్ని ద్వేషించిన మీరంతా ఈరోజు నాఅంతటి మనిషిలేదంటున్నారు. ఈ అదృష్టం ఎప్పటికీ ఇలాగే వుండాలని కోరుకుంటు న్నాను'' అన్నది సుబ్బాయమ్మగారు.

*


ఎన్నో ఏళ్ళ తర్వాత ఆ ఇంట్లో సుబ్బాయమ్మ గారి కుటుంబ సభ్యులందరూ కలుసుకున్నారు. రామారావుగా రొక్కరే లేరు.

సుబ్బాయమ్మగారి చేతిమీదుగా అల్లుళ్ళకు, కూతుళ్ళకు బట్టలందాయి. ఆమె కూతురు సుభద్రను పిలిచింది. ఏకాంతంలో మాట్లాడింది.

''మీ నాన్నగారు మీకు బాకీ వున్న మొత్తాల వివరాలు చెబితే వడ్డీతో సహా ఆడపిల్లల అందరి బాకీలూ తీర్చేస్తాను'' అన్నది సుబ్బాయమ్మగారు.

''అదేమిటమ్మా అలాగంటావు? తండ్రీ కూతుళ్ళ మధ్య బాకీలేమిటి?'' అన్నది సుభద్ర.

''ఇదేమాట కొన్నేళ్ళక్రితం అని వుంటే మీ




కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.
కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.
ఈ రోజునే కేశవర్ధిని కొనండి.
ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.






కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087

OBM 8473/TG

నాన్న పోయివుండేవారు కాదు'' అన్నది సుబ్బాయమ్మగారు తాపీగా.

సుభద్ర ముఖం ఎర్రగా అయింది. ఆమె చటుక్కున "అమ్మా కోపగించుకోకుండా నామాట విను నాన్నపోయి వుండకపోతే ఇదేముక్క ఈ రోజున నువ్వు అని వుండగలిగే దానివా?'' అన్నది.

సుబ్బాయమ్మగారు తెల్లబోయింది. కూతురు ఎంతమాట అన్నది? ఈ కుటుంబపు ప్రగతికి తన భర్త జీవితం అడ్డు వచ్చిందా?

"ఏమీ అనుకోకమ్మా వున్నమాట అన్నాను. నాకేమీ నాన్నమీద పగలేదు. కానీ ఆయన నీలో వున్న ఇటువంటి అద్భుతశక్తిని ఎలా నిర్లక్ష్యం చేశాడు? ఇంట్లో వున్న అదృష్టాన్ని ఎందుకు అర్థం చేసుకోలేకపోయాడు? అని ఆలోచిస్తుంటే చాలా బాధగా వుంటుంది నాకు. ఈ రోజు సంబరంలో అందరితో పాటూ ఆయన లేరన్న లోటు నన్ను బాధిస్తూనే వుంది. కానీ తప్పెవరిది?''

సరిగ్గా అప్పుడే రామం ఆ గదిలోనికి ప్రవేశించాడు.

"అంతా విన్నానత్తయ్యా! తప్పెవరిదీ కాదు. మన వ్యవస్థది. అయితే ఈ వ్యవస్థను మనం మార్చవచ్చు. మార్చాలనుకోక పోవడం మన తప్పు. ముందు తరాలవారు వెనుక తరాల వారి నుంచి నేర్చుకోవలసినదేమీ లేదనుకుంటే వ్యవస్థ వెనుకకు నడవడం ఆరంభిస్తుంది.'' అన్నాడు రామం "తాతగారు బామ్మనెప్పుడూ మనిషిలా చూడలేదు. ఆమెకు మనసుంటుందనీ, కోరికలుంటాయనీ అనుకోలేదు. ఆమెకు తెలివి వుంటుందనీ అది ఉపయోగించుకో వచ్చుననీ గ్రహించలేదు. ఆయన తన అవసరాలకు బామ్మను ఉపయోగించుకున్నారు. ఆయన అవసరాలకుపయోగపడడమే తన బాధ్యత అని బామ్మ భావించింది. అయితే ఆమె వ్యక్తిత్వం పూర్తిగా చచ్చిపోలేదు. అది తాతగారికి అంకితమైపోయింది. అందువల్ల ఆయన సుఖపడ్డాడు. సుఖంగానే వెళ్ళిపోయారు. ఆయన సంతానంలో ఒక్కరికి కూడా ఆయనంటే ఇష్టం లేదు. కానీ అందరినీ ఆయనకు సాయపడేలా చేసింది బామ్మ. నేనూ ఆ శక్తినే ఉపయోగించుకున్నాను. బామ్మ వ్యక్తిత్వపు నీడలో జీవించాను. ఆమె వ్యక్తిత్వపు గొప్పతనాన్ని నిరూపించాను.'' అని ఓ క్షణం ఆగి "ఈనాడు ఎందరో స్త్రీలు ఎన్నో రంగాల్లో ముందున్నారు. వారు కూడా బామ్మ తాతగారికి కట్టుబడినట్లే కొన్ని స్వార్థపు పరిమితులకు కట్టుబడిపోవడం వల్ల వ్యవస్థ వెనుకకు నడుస్తున్నది. బామ్మ సలహాలతో నేను పైకి వస్తుంటే నాతోపాటు మరెందరో వృద్ధిలోకి వచ్చారు. నేను ఎక్కువ బాగుపడ్డాను. కొందరు తక్కువ బాగుపడ్డారు. కానీ అది వారి తాత్కాలిక అవసరాలను తీర్చేది తప్పితే స్వయం ఉపాధికి పనికివచ్చేది కాదు. తాతగారి వల్ల మన కుటుంబం దెబ్బతింటే ప్రజలకు తాత్కాలిక అవసరాలను తాత్కాలిక ప్రయోజనాలనాశించి తీర్చే ప్రభుత్వం వల్ల దేశపు ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుంది. బామ్మ వ్యక్తిత్వం అసామాన్యమైనది. ఆమె ఒక మూల కూర్చుంటే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు తమలో తాము కలహించుకున్నారు. ఆమె హూంకరించి నిలబడితే ఇంటిల్లపాదీ త్యాగానికి సిద్ధపడ్డారు. ఆమె ఆప్యాయంగా పిలిస్తే అందరూ ఇక్కడ కలిశారు. ఈ ఇంట్లో అందరినీ కలిపి రప్పించగల శక్తి బామ్మకు మాత్రమే వున్నది. మరుగున పడిన బామ్మ శక్తి నాకారణంగా వెలికి వచ్చింది. ఆ శక్తి ఇంక మీదట ఎన్నడూ ప్రకాశిస్తూనే వుంటుంది. మనమందరం ఆ శక్తిని తిన్నగా ఉపయోగించుకోవాలి'' అన్నాడతడు.

"బాగా చెప్పావురా!'' అని సుభద్ర రామాన్ని మెచ్చుకున్నది. ఆ రోజామె ఇంట్లో అందరికీ రామం మాటలు చెప్పింది.

అందరూ ఆ మాటల్లో నిజాన్ని గ్రహించారు.

సుభద్ర ఆఖరి కూతురు "మన దేశానికి కూడా ఇటువంటి బామ్మ ఇప్పుడూ వుంటే ఎంత బాగుండును?'' అన్నది.

"ఏ బామ్మ అయినా పొగిడిన వారికి దానాలిస్తూ అపాత్రులకు సాయపడుతూ, అప్పైనా చేసి పటాటోపంగా జీవించాలనుకునే రామారావుగారి లాంటి వ్యక్తిత్వానికి దాసోహమని అన్నదంటే మాత్రం ఆ కుటుంబానికీ, ఆ దేశానికీ మోక్షముండదు'' అన్నాడు గోపాలం.

"ఈ సంతోష సమయంలో ఆయన నాటిపోసు కోవడం నాకు విచారాన్ని కలిగిస్తుంది.'' అన్నది సుబ్బాయమ్మగారు.

ఆటుపైన అక్కడింకెవ్వరూ రామారావుగారి గురించి మాట్లాడలేదు. సుబ్బాయమ్మగారి వంటి వ్యక్తికి భర్త అయినందుకు ఆయన్ను ద్వేషించేవారు కూడా స్వతంత్రులై వుండీ ద్వేషించలేరాయన్ను.

*

రామారావుగారు మసలిన ఇంట్లోనే సుబ్బాయమ్మగారుంటున్నది. ఆమెకిప్పుడు సుమారు ఎనభై సంవత్సరాలు. అయినప్పటికీ ఆమె ఎంతో ఆరోగ్యంగానూ, చలాకీగానూ వుంటున్నది. అందుకు కారణం మూడు పువ్వులూ ఆరు కాయలూగా వుంటున్న ఆమె కుటుంబం.

ఎవరి పిల్లలనైనా హైస్కూలు చదువులకు సుబ్బాయమ్మగారి ఇంట్లోనే వదలి వెళ్ళడం ఆచారంగా వుంటున్నది. ఆమె శిక్షణలో, సంరక్షణలో పిల్లలు వృద్ధిలోనికి వస్తారని అందరికీ నమ్మకం. సుబ్బాయమ్మగారికి చిన్న పిల్లలంటే ఎంతో ఇష్టం. వారితో ఆమెకు చక్కని కాలక్షేపం.

ఇప్పటికీ సుబ్బాయమ్మగారింట్లో నలుగురు పేద విద్యార్థులుండి చదువుకుంటూనే వున్నారు. అవసరంలో వున్నవారు సాయానికి ఆమె వద్దకు వస్తుంటారు. ఆమె పేరు అన్నపూర్ణకు మారు పేరయింది.

సుబ్బాయమ్మగారి కుటుంబ సభ్యులందరూ శుభకార్యాలకు, తగాదాలకు, వ్యవహారాలకు— ఆమె సలహా సంప్రదింపుల కోసం వచ్చి వెడుతూంటారు. ఆమె మాటకు అందరూ విలువనిస్తారు.

ఇప్పుడు సుబ్బాయమ్మగారి ఇల్లు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వుంటున్నది.

"ముసలి వయసులో భార్యాభర్తలు ఒకరికొకరు తోడు అంటారు. కానీ ఈ వయసులో మీరు ఎందరినో ఆవహించి నాకు తోడుగా వున్నారు. మీరు కోరినట్లుగా వున్న ఈ యింట మీరు లేకపోవడం కూడా ఒక లోటు కాకపోవడం విచిత్రంగా వున్నది.'' అనుకున్నది సుబ్బాయమ్మగారు.

స్త్రీ జీవితాన్ని భర్త వ్యక్తిత్వంతో ముడిపెట్టి– భర్త వున్నంత కాలమూ అతడికి బానిసగానూ, అతడి మరణానంతరమూ, ఆమెను జీవన్మృతురాలిగానూ తయారు చేసే ఈ వ్యవస్థలోని రెండవ లోపం సవరించబడడం వల్ల ఎనభై సంవత్సరాల వయసులో కూడా చలాకీగా, ఆరోగ్యంగా వుండగలగడమే కాక–ఎందరి ఆరోగ్యానికో సుబ్బాయమ్మగారు కారణభూతురాలవుతున్నది.

సుబ్బాయమ్మగారి కథ మరెందరో సుబ్బాయమ్మగార్లను తయారు చేయగలదన్న ఆశ ఈ రచనకు ప్రోత్సాహకారణమని ఈ కథ చదివిన వారందరూ ఒప్పుకుంటారు.

[సమాప్తం]